యాలక్కి అరటి.. అన్నదాతకు లక్కీ


మార్కెట్‌కు తరలించడానికి సిద్ధం చేసిన అరటి గెలలు

- ఈ రకం అరటికి మార్కెట్‌లో మంచి ధర
- టన్ను రూ.45 వేలకు పైగానే
- అరటి సాగుపై అన్నదాతల ఆసక్తి

మడకశిరరూరల్: అరటి సాగు అన్నదాతలకు లాభాలు కురిపిస్తోంది. ముఖ్యంగా యాలక్కి రకం అరటి లక్షాధికారులను చేస్తోంది. మార్కెట్‌లో మంచి ధర ఉండటంతో యాలక్కి అరటి సాగుపై రైతులు దృష్టి పెట్టారు. ఈ పంట సాగు విస్తరిస్తోంది. మడకశిర డివిజన్‌లోని మడకశిర, అగళి, అమరాపురం, గుడిబండ, రొళ్ల మండలాల్లో వ్యవసాయ బోరు బావుల కింద 100 ఎకరాలు, హిందూపురం డివిజన్‌లో 150 ఎకరాల్లో అరటి సాగైంది. వేరుశనగ తదితర సంప్రదాయ పంటలతో విసిగి వేసారిన రైతులు అరటిపంటసాగు వైపు అడుగులు వేశారు. సమగ్ర యాజమాన్య పద్ధతులు, ఆర్‌బీకేల ద్వారా అవసరమైన ఎరువులు అందుబాటులో ఉండటంతో అన్నదాతలు ఉత్సాహంగా అరటి సాగుపై దృష్టి పెట్టారు.

యాలక్కి రకంతో మంచి లాభాలు

అనంతపురం, తుమకూరు, హిందూపురం పట్టణాల్లో యాలక్కి రకం అరటి పిలకలు కొనుగోలు చేస్తున్నారు. ఎకరాకు 500 మొక్కలు నాటి కూలీలు, ఎరువులు, మందులు తదితర వాటికి రూ.70 వేల వరకు పెట్టుబడి పెడుతున్నారు. నేల సారవంతాన్ని బట్టి పది టన్నులవరకు దిగుబడి ఉంటుంది. టన్ను రూ.45వేలకుపైగా ధర పలుకుతోందని, ఎకరాకు రూ 2.5 లక్షల వరకు ఆదాయం వస్తున్నట్లు రైతులు చెబుతున్నారు.

సేంద్రియ పద్ధతుల్లో సాగు



బోరు బావుల కింద మూడు ఎకరాల్లో సేంద్రియ పద్ధతుల్లో యాలక్కి రకం అరటి పంట సాగు చేశాను. 15 టన్నుల దిగుబడి వచ్చింది. టన్నుఅరటిని రూ.45 వేలతో విక్రయించా. ఖర్చులు పోనూ ఎకరాకు రూ.2.5 లక్షలకు పైగా ఆదాయం వచ్చింది. మరో ఆరు టన్నులకు పైగా దిగుబడి వస్తుంది.

-బాబురెడ్డి, రైతు, ఆర్ పెద్దపల్లి, మడకశిర మండలం

20 టన్నులు విక్రయించా



బోరు కింద రెండు ఎకరాల్లో డ్రిప్ విధానంలో అరటి సాగు చేశాను. మంచి దిగుబడి వచ్చింది. 20 టన్నులను టన్ను రూ.43 వేలతో విక్రయించా. కూలీలు, ఎరువులు, మందులు ఖర్చులు పోనూ ఎకరాకు రూ.3 లక్షల వరకు ఆదాయం వచ్చింది.

-నాగరాజు, రైతు, మడకశిర పట్టణం

రెండు డివిజన్లలో 250 ఎకరాల్లో అరటి సాగు



మడకశిర డివిజన్‌లో 100 ఎకరాలు, హిందూపురం డివిజన్‌లో 150 ఎకరాల్లో రైతులు వ్యవసాయ బోరు బావుల కింద అరటి పంట సాగు చేశారు. మార్కెట్‌లో మంచి ధర ఉండడంతో రైతులకు మంచి ఆదాయం వస్తోంది. అరటి సాగుపై రైతులను ప్రోత్సహిస్తున్నాం.

-చిన్న రెడ్డయ్య, ఉద్యాన శాఖ అధికారి, మడకశిర

క్లుప్తంగా

7న బ్రహ్మ రథోత్సవం

పావగడ: పట్టణంలో ప్రసిద్ధి చెందిన శ్రీ కణివె లక్ష్మీనరసింహ స్వామి 68వ బ్రహ్మ రథోత్సవాన్ని ఈ నెల 7న నిర్వహించనున్నట్లు ఆలయ సమితి పదాధికారులు గురువారం తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

ఎమ్మెల్సీ ఆర్థిక సాయం


ఆర్థికసహాయం అందజేస్తున్న ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్

హిందూపురం: యువకుడి శస్త్ర చికిత్స కోసం ఎమ్మెల్సీ మహమ్మద్‌ఇక్బాల్, వైఎస్సార్‌సీపీ నాయకులు రూ.2.25 లక్షల ఆర్థిక సహాయం చేశారు. హిందూపురం మండలం కిరికెర గ్రామానికి చెందిన మున్నీ పెద్దకుమారుడు ఉమర్‌ఫరూక్ భుజం ఎముక విరిగి కళాశాలకు వెళ్లలేక పోతున్నాడు. బెంగళూరులో వైద్య పరీక్షలు చేయించగా శస్త్ర చికిత్సకు రూ.5లక్షలు ఖర్చు అవుతుందని డాక్టర్లు సూచించారు. మున్నీ ఎమ్మెల్సీని కలిసి తన కొడుకును కాపాడాలని విన్నవించింది. స్పందించిన ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ నాయకుల ద్వారా రూ.లక్ష సేకరించి సొంతంగా రూ.లక్షా 25వేలు కలిపి మొత్తం రూ.2.25లక్షల మొత్తాన్ని గురువారం తల్లీ కుమారుడికి అందజేశారు. జెడ్పీటీసీ నాగభూషణం, మార్కెట్‌యార్డు మాజీ వైస్‌చైర్మన్ పురుషోత్తం రెడ్డి, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ గౌడ్, సర్పంచ్ అదెప్ప పాల్గొన్నారు.

నివాళులర్పించిన ఎమ్మెల్యే


నివాళులర్పిస్తున్న శంకరనారాయణ

పెనుకొండ రూరల్: చంద్రగిరి గ్రామానికి చెందిన చెన్నారెడ్డి(55) అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శంకర నారాయణ గ్రామానికి వెళ్లి చెన్నారెడ్డికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

చట్టాలపై అవగాహన అవసరం

రొద్దం: అంతర్జాతీయ మహిళా వారోత్సవాల సందర్భంగా గురువారం మండలంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు ఎంపీహెచ్‌ఈఓ శ్రీనివాసులు చట్టాలపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాలతో జరిగే అనర్థాలను వివరించారు. దిశ చట్టం ప్రాముఖ్యతను తెలియజేశారు. ప్రిన్సిపాల్ నాగరత్నమ్మ, పీహెచ్‌ఎన్ లక్ష్మీనరసమ్మ పాల్గొన్నారు.

గుత్తికోట క్యాలెండర్ విడుదల


క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

లేపాక్షి: లేపాక్షి నంది విగ్రహం వద్ద రాయలసీమ విమోచన సమితి అధ్యక్షుడు వై.రాజశేఖర్ రెడ్డి, ఏపీ టూరిజం మేనేజర్ లక్ష్మణరావు గురువారం గుత్తికోట క్యాలెండర్‌ను విడుదల చేశారు. గుత్తికోట, లేపాక్షికి యునెస్కో గుర్తింపు వచ్చేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు ఇచ్చి అభివృద్ధి చేయాలన్నారు. సభ్యులు క్రిష్టారెడ్డి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి


శివుడి పూజలో ఎమ్మెల్యే శంకరనారాయణ

రొద్దం: మండల కేంద్రంలోని పెన్నానది ఒడ్డున కొలువైన పురాతన శివ రుద్రపాద ఆశ్రమం అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే శంకరనారాయణ అన్నారు. గురువారం ఓ వివాహ వేడుకకు హాజరైన ఎమ్మెల్యే రుద్రపాద శివాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రశేఖర్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, బోయ తిమ్మయ్య, రవిశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మడకశిర(అగళి): మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీడీఓ నరేంద్రకుమార్, ఎంపీపీ రేణుక తెలిపారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీటీసీలు, సర్పంచులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సమావేశం దృష్టికి తెచ్చారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దని ఎంపీపీ, ఎంపీడీఓలు మండల స్థాయి అధికారులకు సూచించారు. హౌసింగ్ ఏఈ గణేష్ మాట్లాడుతూ మండలానికి కొత్తగా 236 ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. తహసీల్దార్ జిలానీ, వైస్ ఎంపీపీలు గాయత్రి, విమలమ్మ, ఏఓ శేఖర్‌నాయక్, పీహెచ్‌సీ డాక్టర్ గాయత్రి, ఎంఈఓ గోపాల్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై నేడు ప్రత్యేక సమావేశం

పెనుకొండ: ఎమ్మెల్సీ ఎన్నికలపై పట్టణంలోని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం సమావేశం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ బోయ నరసింహ, మండల కన్వీనర్ నాగలూరు బాబు తెలిపారు. ఎమ్మెల్యే శంకరనారాయణ, ఎమ్మెల్సీ సానిపల్లి మంగమ్మ హాజరవుతారన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సహకరించాలి


మడకశిర: మాట్లాడుతున్న ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ మారుతీ ప్రసాద్

మడకశిర: పశ్చిమ రాయలసీయ నియోజకవర్గం పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంతంగా జరపడానికి అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ మారుతీ ప్రసాద్ కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికలపై అన్ని రాజకీయ పార్టీల నాయకులతో గురువారం ఆయన తన కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించారు. ఎన్నికల కోడ్‌ను తప్పకుండా పాటించాలని కోరారు.

రొళ్ల: ఓటు హక్కు వినియోగంపై వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో అఖిలపక్షం నాయకులకు తహసీల్దార్ హసీనాసుల్తానా అవగాహన కల్పించారు.

లేపాక్షి: ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్ విధానంపై తహసీల్దార్ బాబు పర్యవేక్షణలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేస్తారో ఆ అభ్యర్థి పేరు పక్కనే ఉన్న బాక్స్‌లో 1,2,3 తదితర అంకెలు లేదా రోమన్ అంకెలలో పెన్నుతో గుర్తించాల్సి ఉంటుందన్నారు. గ్రామ సర్పంచ్ ఆదినారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

హిందూపురం టౌన్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునే విధానంపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సౌజన్య లక్ష్మీ, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు రాజకీయ పార్టీల నాయకులకు అవగాహన కల్పించారు.

విధుల్లో నిర్లక్ష్యం వద్దు


మాట్లాడుతున్న పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్

గుడిబండ: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్ రెవెన్యూ సిబ్బందిని హెచ్చరించారు. గురువారం ఆయన తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఎలాంటి ఆధారాలు లేకుండా 1-బిలను ఒకరి పేరు నుంచి మరొకరికి ఇస్తున్నట్లు, మ్యుటేషన్‌పై ప్రజలను ఇబ్బంది పెడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ఇలాంటివి పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమగ్ర భూ సర్వేను పక్కాగా నిర్వహించాలని సూచించారు. తహసీల్దార్ నాగభూషణం, భూసర్వే డిప్యూటీ తహసీల్దార్ రాంభూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పూర్తయిన పెద్ద చెరువు కట్ట మరమ్మతులు


పరిశీలిస్తున్న ఎస్ఆర్‌డీ అధికారుల బృందం

గోరంట్ల: గోరంట్ల పట్టణ సమీపంలోని పెద్ద చెరువు కట్టకు రూ.కోటీ 17లక్షలతో చేపట్టిన మరమ్మతులు పూర్తయ్యాయి. దీంతో విజయవాడ ఎస్ఆర్‌డీ అధికారుల బృందం గురువారం చెరువు కట్టను పరిశీలించింది. నాణ్యతా ప్రమాణాలను పూర్తిగా పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌డీ ఈఈ చంద్రశేఖర్, గ్రౌండ్ వాటర్ జాయింట్ డైరెక్టర్ కేఎస్ శాస్త్రి, ఇరిగేషన్ ఈఈ నారాయణనాయక్, ఏఈ రవికుమార్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయానికి శ్రమించండి

- ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్, చిత్రంలో ఎంపీ గోరంట్ల మాధవ్

హిందూపురం: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయించి భారీ మెజార్టీతో గెలిపించాలని ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎంవీ రామచంద్రారెడ్డి విజయం కోసం గురువారం రాత్రి ప్రశాంత్ నగర్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మున్సిపల్ కౌన్సిలర్లు, నియోజకవర్గంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, హిందూపురం పార్టీ పరిశీలకులు రెడ్డీశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘనీ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలను పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, బూత్ స్థాయి సభ్యులు పట్టభద్రుల ఓటర్లను కలిసి పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరాలని సూచించారు. అదేవిధంగా ఎంవీ రామచంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసేలా ఉపాధ్యాయులను అభ్యర్థించాలన్నారు. సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, రాష్ట్రాభివృద్ధి, నిరుద్యోగ యువతకు కల్పించిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పట్టభద్రులకు వివరించి ఓట్లు అడగాలన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మన్ జబీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

వెన్నపూస రవీంద్రారెడ్డికి మద్దతుగా ప్రచారం


హిందూపురంటౌన్: నమూనా బ్యాలెట్ పత్రాలను అందజేసి ఓటును అభ్యర్థిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

హిందూపురం టౌన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి వైఎస్సార్‌సీపీ తరపున బరిలో ఉన్న అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మద్దతుగా ఆయన సోదరుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు వెన్నపూస శివారెడ్డి గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముద్దిరెడ్డిపల్లిలోని ప్రభుత్వ పాఠశాల, సచివాలయాలు, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాల వద్ద ప్రచారం నిర్వహించి కరపత్రాలను అందజేశారు. వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. నిజాముద్దీన్, సోహేల్, బెన్ని పాల్గొన్నారు. అదే విధంగా వెన్నపూస రవీంద్రారెడ్డి తరపున రాయలసీమ విమోచన సమితి అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి ప్రచారం చేశారు.

మడకశిరరూరల్: ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు. గురువారం చందకచెర్లు పంచాయతీలోని గ్రామాల్లో పట్టభద్రులను కలిసి ఓట్లను అభ్యర్థించారు. సింగిల్‌విండో అధ్యక్షుడు రామిరెడ్డి, సర్పంచ్ ప్రభావతిబాయి, సచివాలయ కన్వీనర్ నాగేంద్రయాదవ్, మాజీ ఎంపీపీ బజ్జప్ప, కన్వీనర్ నారాయణస్వామి పాల్గొన్నారు.

మడకశిర(అగళి): వెన్నపూస రవీంద్రారెడ్డి తరపున వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మహేంద్ర, అగళి సచివాలయ కన్వీనర్ గంగా నాగరాజు, బ్యాడిగెర ఎంపీటీసీ సురేష్ పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు.

అమరాపురం: వెన్నపూస రవీంద్రారెడ్డి తరపున రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ నళిని, ఎంపీపీ ఈరన్న, జెడ్పీటీసీ స్వారక్క, సర్పంచ్ వాగేష్ వీ.అగ్రహారం, వలస, తమ్మడేపల్లి, అమరాపురం, హల్కూరు తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి రవిశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు కృష్ణమూర్తి, లలితమ్మ, ఎంపీటీసీలు కెంచప్ప, నారాయణ, హనుమంతరాయ పాల్గొన్నారు.

బైక్‌లు ఢీ..ముగ్గురికి గాయాలు

- ఇద్దరి పరిస్థితి విషమం



గాయపడిన శశి హనుమంతరాయ, మారుతీ

అమరాపురం: మండలంలోని చిట్నడకు గ్రామ సమీపంలో గురువారం రాత్రి బైక్‌లు పరస్పరం ఢీ కొని ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. హలుకూరు గ్రామానికి చెందిన శశి, హనుమంతరాయ ఒక బైక్‌లో, మారుతీ మరొక బైక్‌లో వెళ్తుండగా గ్రామ సమీపంలో ఢీకొన్నాయి. గాయపడిన ముగ్గురినీ 108 వాహనంలో మడకశిర ప్రభుత్వాసుపత్రికి తరలించారు. శశి, హనుమంతరాయ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

సంక్షిప్త సమాచారం

పాఠశాలల తనిఖీ

గుడిబండ: కదుపులయ్య పాళ్యం ప్రాథమిక పాఠశాలను గురువారం ఎంఈఓ శ్రీధర్ తనిఖీ చేశారు. విద్యార్థుల వర్క్ బుక్‌లను పరిశీలించారు. 5వ తరగతి విద్యార్థులతో ఆంగ్ల పాఠాన్ని చదివించి బోధనపై ఉపాధ్యాయులకు సూచనలు ఇచ్చారు.

మడకశిరరూరల్: ఏఆర్ రొప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంఈఓ భాస్కర్ గురువారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ట్యాబ్‌ల వినియోగంపై విద్యార్థులతో ఆరా తీశారు. తర్వాతఆర్ రొప్పం, గౌరిపురంలోని ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు.

ఆటోస్టాండ్ ప్రారంభం

గోరంట్ల: పాలసముద్రం క్రాస్ వద్ద ఏర్పాటు చేసిన ఆటో స్టాండ్‌ను శ్రీ సత్యసాయి జిల్లా ఆటో కార్మిక సంఘం అధ్యక్షుడు గౌస్‌లాజం గురువారం ప్రారంభించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్, శివారెడ్డి పాల్గొన్నారు.

పీఎఫ్ బకాయిల కోసం ధర్నా

చిలమత్తూరు: కొడికొండ చెక్‌పోస్ట్‌లో ఉన్న రిచ్‌మన్ సిల్క్స్‌లో 30 ఏళ్ల క్రితం పనిచేసిన కార్మికులకు పీఎఫ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్‌చేస్తూ సీపీఎం నాయకులు గురువారం ఆ కంపెనీ వద్ద ధర్నా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ పీఎఫ్ కోసం కోత విధించిన రూ. 40 లక్షలు యాజమాన్యం చెల్లించకుండా ఎగ్గొట్టిందని మండిపడ్డారు. వెంటనే పీఎఫ్ సొమ్ము చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకుడు ప్రవీణ్, కార్మికులు పాల్గొన్నారు.

గ్రామీణులతో మమేకం కావాలి

పావగడ: ఎన్ఎస్ఎస్ విద్యార్థులు గ్రామీణులతో మమేకమై సేవాభావాన్ని చాటాలని ఎమ్మెల్యే వెంకటరమణప్ప అన్నారు. యర్రపాళ్యం గ్రామంలో గురువారం నిర్వహించిన ఎన్ఎస్ఎస్ వార్షికోత్సవ శిబిరంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శ్రీధర్, పరశురాంపురం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.బి.ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నుంచి జేడీఎస్‌లో చేరిక

పావగడ: కాంగ్రెస్ నాయకులు గురువారం జేడీఎస్‌లో చేరారు. 8వ వార్డుకు చెందిన లతీఫ్ సాబ్, తలారి గోవిందప్ప నేతృత్వంలో సుబ్బయ్య శెట్టి, మారుతి, హరీశ్, వెంకటేశ్, నరేంద్ర, రవి, మంజునాథ్, అభి, హేమంత్, కార్తీక్, మధు తదితరులు జేడీఎస్‌లో చేరారు. వీరికి జేడీఎస్ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప కండువాలు కప్పిపార్టీలోకి ఆహ్వానించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

చిలమత్తూరు: మండలంలోని లక్ష్మీపురం సమీపంలో గురువారం దాడులు నిర్వహించి పాతచామలపల్లికి చెందిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని 182 కర్ణాటక మద్యం ప్యాకెట్లు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

హిందూపురం టౌన్: పట్టణంలోని వేణువిద్యా విహార్ పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, ఎంఈఓ గంగప్ప పదర్శనను ప్రారంభించారు. కియా పరిశ్రమ, విద్యుత్ ఉత్పత్తి కేంద్రం, రైతులను పాము కాటు నుంచి రక్షించే పరికరం, సంక్రాంతి, దీపావళి ఉత్సవాల నమూనాలు, తోలుబొమ్మలాట తదితరాలు ఎంతో ఆకట్టుకున్నాయి. కౌన్సిలర్ నస్రీన్ బాను పాల్గొన్నారు.

పంట అవశేషాలను పొలంలో కాల్చొద్దు

హిందూపురం: పంటల అవశేషాలను పొలంలో కాల్చవద్దని సహాయ వ్యవసాయ సంచాలకులు అల్తాఫ్ అలీఖాన్ గురువారం ఒక ప్రకటనలో సూచించారు. చాలామంది రైతులు పొలంలోనే చిన్న చిన్న కుప్పలు వేసి నిప్పు పెడుతుంటారని, అలా కాల్చడం వల్ల నేలలోని సూక్ష్మ పోషకాలు కాలిపోయి ఆ ప్రాంతంలో మరో మొక్కసరిగా మొలవదన్నారు. పంట అవశేషాలను దుక్కిలో కలిపేయడం వల్ల నేలలో పోషకాలు పెరిగి పంట

ఆచరణ సాధ్యం కాని టార్గెట్లు రద్దు చేయాలి

హిందూపురం: పోస్టల్ శాఖ డీజీ ఆఫీసు నుంచి జీడీఎస్‌లపై అశాస్త్రీయమైన, ఆచరణ సాధ్యం కాని టార్గెట్లు ఆపివేయాలని ఆల్‌ఇండియా గ్రామీణ డాక్‌సేవక్స్ యూనియన్ అధ్యక్షుడు మునాఫ్, కార్యదర్శి నరసింహులు డిమాండ్ చేశారు. యూనియన్ పిలుపు మేరకు గురువారం హెడ్‌పోస్టాఫీసు వద్ద యూనియన్ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. టార్గెట్ల కోసం జీడీఎస్‌లను వేధించడం, ఒత్తిడి చేయడం మానుకోవాలన్నారు.

మహిళా సంఘాలు ఆర్థికాభివృద్ధి చెందాలి

అమరాపురం: మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఏరియా కోఆర్డినేటర్ ప్రసాద్ సూచించారు. మండలంలోని మహిళా సంఘాల ప్రగతిపై గురువారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.

కైవారం తాతయ్య ఉత్సవాల పోస్టర్ల విడుదల

హిందూపురం: ఈనెల 7, 8 తేదీల్లో జరిగే శ్రీక్షేత్రం కైవారం తాతయ్య జయంతి ఉత్సవాల పోస్టర్లు, బ్యానర్లను గురువారం స్థానిక కేవీఆర్ ఫంక్షన్ హాల్‌లో యోగినారాయణ సేవాసమితి ఆధ్వర్యంలో సేవాసమితి అధ్యక్షుడు రవిశంకర్ ఆవిష్కరించారు.

పేదల నడ్డి విరుస్తున్న కేంద్రం

సోమందేపల్లి: వంటగ్యాస్ ధర తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు గురువారం సోమందేపల్లిలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఖాళీ సిలిండర్లతో ఆందోళన చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ సర్కార్... గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలు పెంచి సామాన్యులను నిలువు దోపిడీ చేస్తోందని మండిపడ్డారు. పెద్దన్న, హనుమయ్య పాల్గొన్నారు.